www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 4 ఫిబ్రవరి 2023
5
కాకినాడ



రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కి ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు ఎంపికైనట్లు ఆదిత్య కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2023 పేరిట వర్చువల్ మోడ్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి యోజన ఉత్సవాలకు ఎంపికైన ఎండి మోనా అర్జు, ఎం.రక్షితలను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ నాయుడు

ముఖ హాజరు వద్దు

-సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

- పారిశుధ్య కార్మికుల ఉద్యమం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర పాలక సంస్థ శానిటేషన్ వర్కర్స్ కు వ్యక్తిగత మొబైల్ ముఖ హాజరు పద్ధతి అమలు చేయరాదని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించారు. శుక్రవారం శానిటేషన్ వర్కర్స్ మస్టర్ పాయింట్ల వద్ద సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు కార్మికులను కలిసి మాట్లాడారు. పలు మార్లు కార్యాలయానికి కూడా తిరగాల్సి వస్తుందని, రాకపోతే జీతం ఆగిపోతుందని చెబుతున్నారని కార్మికులు తెలిపారు. సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మి కుల పనిని పరిశీ లించడానికి చాలా మంది అధికారులు ఉన్నారన్నది గమ నించాల న్నారు. కార్మికుడు ఒకసారి డ్యూటీకి వచ్చాక గైర్హాజరు అయ్యే పరిస్థితి ఉండదన్నారు. ప్రస్తుతం ఉన్న ఎఫ్.ఆర్.ఎస్. పద్ధతి వల్లనే కొన్ని సార్లు జీతాలు కోత పడిన విషయం అధికారులు గమనించాలన్నారు. ఈ పద్ధతినే రద్దు చేయాలని కోరుతూ ఉంటే తాజాగా వ్యక్తిగత మొబైల్ ముఖ హాజరు పద్ధతి ప్రవేశ పెట్టడం చాలా ఇబ్బందిగా ఉంటుంది అన్నారు. పారిశుధ్య కార్మికులు ఎక్కువ మంది నిరక్షరాస్యులని, ఒకవేళ చదువుకున్నా కొంతవరకు మాత్రమే ఉంటుందన్నారు. సాధారణ ఫోన్ మాట్లాడగలరు గానీ, మెసేజ్ కూడా చూసే పరిస్థితి లేదన్నారు. ఈ పరిస్థితుల్లో వీరు స్మార్ట్ ఫోన్ ఏవిధంగా ఉపయోగిస్తారో అధికారులు ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిగత మొబైల్ ముఖ హాజరు పద్ధతి పారిశుధ్య కార్మికులకు అమలు చేయవద్దని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ముందుగా విన్నవించాలని సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) కాకినాడ నగర పాలక సంస్థ నాయకులు బంగారు సత్తిబాబు, జలగడుగుల శ్రీనివాస్, దళాయి దుర్గారావు, భవిశెట్టి గురుమూర్తి, బంగారు సరస్వతి, యర్రంశెట్టి నాగబాబు, వర్రే రమణ పాల్గొన్నారు.



కార్మికులను కలిసి మాట్లాడుతున్న సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపి గీత, కలెక్టర్ కృతిక, ప్రజాప్రతినిధులు

విదేశీ విద్యా దీవెనతో ప్రతిభకు పట్టం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతిభను ప్రోత్సహిస్తూ అర్హులైన విద్యార్థులకు సంతృప్త స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలుచేస్తున్నట్లు కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. కార్యక్రమానికి కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్ నుంచి ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతిక శుక్లా, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పి.అమ్మాజీ, రాష్ట్ర ఆయ్యారక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్ర కళాదీప్తి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాలోని లబ్ధిదారుల తల్లిదండ్రులకు ఎంపీ, కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మెగా చెక్కును అందించారు. ఎంపి గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి అర్హతను రూ. 8 లక్షలకు పెంచడం ద్వారా ఎక్కువ మందికి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కలెక్టర్ కృతిక మాట్లాడుతూ క్యూఎస్ ర్యాంకింగ్‌లో టాప్ 200లో ఉన్న యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యా సంస్థల్లో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకినాడ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులకు తొలి విడతలో రూ. 26.84 లక్షల సహాయం అందుతోందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, కలెక్టర్ లబ్ధిదారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి షేక్ ఇషాక్, జిల్లాలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.



డైరీని ఆవిష్కరిస్తున్న యునైటెడ్ ఎస్‌సి, ఎస్‌టి పోరం, కెవిపిఎస్ నాయకులు

ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం

-కేంద్ర బడ్జెట్‌పై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఆర్థిక శాఖ మంత్రివర్యులు నిర్మలా సీతారామన్ 10 శాతం సైజ్ పెంచినట్లు బడ్జెటు చూపించిన సామాజిక న్యాయ సాధికారత దళితుల కోసం కేటాయించిన గత బడ్జెట్ కన్న తక్కువ కేటాయింపులు చేసి దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని యునైటెడ్ ఎస్‌సి, ఎస్‌టి ఫోరమ్ జిల్లా నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కచేరి పేట కమ్యూనిటీ హాల్‌లో కెవిపిఎస్ ముద్రించిన డైరీని యునైటెడ్ ఎస్‌సి, ఎస్‌టి ఫోరం నాయకులు, కెవిపిఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం బడ్జెట్ 1819.52 కోట్ల రూపాయలు కేటాయిస్తే ఈ సంవత్సరం కేవలం 976.86 కోట్ల రూపాయలు కేటాయించటం సిగ్గు చేటన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి నామమాత్రపు కేటాయింపులు చేశారన్నారు. దేశంలో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాలకు కేవలం 3.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. అలాగే 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్ జాతులకు కేవలం 2.7 శాతం మాత్రమే కేటాయించారన్నారు. సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదని ఆ తరగతులకు ఈ బడ్జెట్ పూర్తిగా అన్యాయం చేశారన్నారు. ఇది దళితుల అభివృద్ధికి వ్యతి రేక బడ్జెట్ అని, ఈ సంవత్సరం స్కాలర్‌షిప్‌లకు కోత పెట్టారని, గ్రామీణ ఉపాధి పనుల కోసం గత బడ్జెట్లో కేటాయించిన 89 వేల కోట్ల నుండి 60 వేల కోట్ల రూపాయలకు తగ్గించేశారని, ఆహార భద్రత కు కూడా నిధులు తగ్గించారన్నారు. దళితులను, గ్రామీణ పేదలను తీవ్ర అన్యాయ చేశారని ఇది కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్ అన్నారు. ఈ బడ్జెట్ ను యునైటెడ్ ఎస్సి ఎస్ టి ఫోరమ్, దళిత సంఘాలు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం వ్యతిరేకిస్తున్నయ న్నారు. కార్యక్ర మంలో యునై టెడ్ ఎస్‌సి, ఎస్‌టి ఫారం జిల్లా నాయకులు గుడాల కృష్ణ, బచ్చుల కామేశ్వర రావు, తుమ్మల నూకరాజు, మోత కృష్ణ మూర్తి, డేవిడ్ కెవిపిఎస్ జిల్లా నాయకులు కె సింహాచలం, జి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాసంఘాల ధర్నా

తాళ్లరేవులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీకి, ఎస్‌సి, ఎస్‌టిలకు రైతాంగానికి బడ్జెట్ కేటాయింపు నిధులు కోత విధించడంపై నిరసిస్తూ ఈ మూడు వర్గాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. శ్రామిక, బలహీన వర్గాలకు కేంద్ర బడ్జెట్ విఘాతం కలిగిస్తుంది అన్నారు. కార్యక్రమంలో దుప్పి అదష్టదీపుడు, తణుకు రాజు, చల్లంగి వెంకటలక్ష్మి, గోడి భాస్కరరావు, వళ్ళు రాజబాబు, పలివెల సింహాచలం, కన్నీడి లక్ష్మణరావు, చల్లా సంతోష్ కుమార్ ,కొక్కిరిమెట్ల సత్తిరాజు, విప్పర్తి శ్రీనివాసరావు, మురాల రాజేష్, వడ్డీ ఏడుకొండలు, కృష్ణ, సుందరపల్లి సత్యనారాయణ, నల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రబీలో పూర్తి ఆయకట్టుకు నీరు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో 2022-23 రబీ సీజన్‌కు పూర్తి ఆయకట్టు నీరు అందించే విధంగా సమగ్ర నీటి నిర్వహణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 2022-23 రబీ సీజన్‌లో పంటలకు సక్రమ నీటి సరఫరాపై వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. తూర్పు, మధ్య డెల్టాలలో రైతులు సాగు చేస్తున్న రెండో పంటకు నీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. కాలువలలో గుర్రపుడెక్క, తుటుకు తొలగించి కాలువలలో అవసరం మేరకు నీటి స్థాయి ఉండే విధంగా చూడాలని అధికారులను సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, ధవళేశ్వరం ఎస్ఇ జి.శ్రీనివాసరావు, గోదావరి ఈస్టర్న్ డెల్టా ఇఇ పి. విజయ్‌గోపాల్, డ్రైన్స్ ఇఇ కె. సుబ్బయ్య, డిఇ శేషగిరి, ఏలేరు కెనాల్ ఎఇఇ జి.శ్రీనివాసు, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, నీటిరు పారుదల శాఖ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారలు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అరెస్టులు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - కాకినాడ

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరు ద్ధరించాలని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఖండించారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న దీక్షలకు సిపిఎం సంపూర్ణ మద్ధతు నిస్తుందని ప్రకటించారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని గత 18 ఏళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తుంటే సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రశాంతంగా సంకల్ప దీక్షలు నిర్వహిం చకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం గర్హనీయమన్నారు. దీనికి నిరసనగా పిడిఎఫ్ ఎం.ఎల్.సి.లు చేస్తున్న 36గంటల నిరాహార దీక్షలకు కూర్చున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలు, పిడిఎఫ్ ఎం.ఎల్.సి. లతో చర్చలు జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాలల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న మండల పరిషత్ పాఠశాలలను శుక్రవారం ఎంఇఒ సిహెచ్ వివి సత్యనారాయణ తనిఖీలు చేశారు. పులిమేరు, గోరింట ఎంపి పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి, రికా ర్డులు పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం కుముదిని, శ్రీనివాస్, సిఆర్ పి వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిర్మాణపనుల వివరాలు తెలుసుకుంటున్న ఎంపి, కలెక్టర్, ఎంఎల్ఎ

రూ.25 కోట్లతో కెవికి శాశ్వత భవనం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రూ.25కోట్లతో కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవన నిర్మాణ పనులు జరుగుతున్నట్టు ఎంపి వంగా గీత అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పి.వెంకటాపురం వద్ద నిర్మితమవుతున్న కేంద్రీయ విద్యాలయ భవనాల నిర్మాణ పనులను శుక్రవారం ఎంపి గీత, కల్టెర్ కృతికాశుక్లా, రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి గీత మాట్లాడుతూ 2012లోనే కేంద్రీయ విద్యాలయానికి స్థలం మంజూరు అయినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని 2019 సంవత్సరంలో తాను ఎంపీగా గెలుపొందిన నాటి నుంచి కేంద్ర రాష్ట్ర నాయకులు, అధికారులను కలిసి నిధులు మంజూరు అయ్యేలా కషి చేశానన్నారు. నూతనంగా నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయంలో ఆధునిక వసతులు ఏర్పాటు, ప్లస్ టూ తరగతులు కూడా ప్రారంభించే విధంగా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆంధ్ర తెలంగాణ రీజియన్‌లో ఉన్న 70 కేంద్రీయ విద్యాలయాల్లో కాకినాడ కేంద్రీయ విద్యాలయం అత్యున్నత విద్యాసంస్థగా నిలిచినందుకు ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ కృతిక మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేసి రానున్న డిసెంబరు నెలాఖరుకు విద్యార్థులకు అందుబాటులో తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కాకినాడ పబ్లిక్ స్కూల్లో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయంలో 500 మంది విద్యార్థులు విద్యనభ్యస్తునారని వీరందరికి త్వరలోనే రూ. 25 కోట్ల ప్రాజెక్టు పెద్ద క్యాంపస్ నిర్మించడంతోపాటు ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, సిబ్బంది క్వార్టర్స్, ఆట స్థలం ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఎంఎల్ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ తాను మొదటిసారిగా ఎంఎల్‌ఎగా ఎన్నికైన తర్వాత 2012లో కాకినాడకు కేంద్రీయ విద్యాలయం మంజూరు అయిందన్నారు. అప్పట్లోనే ఎస్‌సి గురుకుల బాలికల పాఠశాలకు సంబంధించి ఐదు ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి మరో ఐదు రకాల స్థలాన్ని పి.వెంకటాపురంలో కేటాయించి నిర్మాణపనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ బి.శేఖర్, కాకినాడ గ్రామీణ మండలం తహశీల్దార్ మురార్జి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

రవాణా, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారుల అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

హెల్మెట్ ధరించి,చిరంజీవిగా జీవించు అని నినదిస్తూ కాకినాడ లో సర్పవరం జంక్షన్ నుండి భానుగుడి వరకు సాగిన ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ర్యాలీ జిల్లా పోలీస్ శాఖ, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాకినాడ ఆటో, మోటారు లారీ సంఘాల ప్రతినిధులు, సభ్యులు ఎంతో ఉత్సాహంతో హెల్మెట్ ధరించి హెల్మెట్ ధరించవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రవీంద్రబాబు మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ రోడ్డు భద్రత, వాహనదారుల క్షేమాన్ని కోరుతూ అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యంతో జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో అధిక శాతం సరైన హెల్మెట్ ధరించక పోవడం వల్ల తలకు తీవ్ర గాయాలతో దుర్మరణాల పాలయ్యారన్నారు. జిల్లాలోనా పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఒక కార్యచరణను సిద్ధం చేసుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా ఆదేశించామని, రోడ్డు ప్రమాదాల బారినపడి ఏ ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా తగిన రక్షణ చర్యలను కూడా చేపడుతున్నామన్నారు ఈ విషయాలను ప్రజలు, వాహన చోదకులందరూ గుర్తెరిగి విధిగా హెల్మెట్ ను ధరించి తాము చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవాణా శాఖ డి.టి.సి మోహన్, ఎంవీఐలు, ఎఎస్‌పిలు పి శ్రీనివాస్, పి సత్యనారాయణ, డీఎస్పీలు, కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలం కోరంగి నుంచి తాళ్ళరేవు వరకు హెల్మెట్ ధరించి జాతీయ రహదారి 2016పై అవగాహన ర్యాలీ నిర్వహించి, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలలో ప్రాణాలను రక్షించుకోవచ్చు అని కోరంగి ఎస్ఐ పి శ్రీనివాస్ కుమార్ వివరించారు. ర్యాలీలో స్టేషన్ సిబ్బంది, ప్రయాణికులు, ఇతర వాహనదారులు పాల్గొన్నారు. **ఏలేశ్వరంలో** ఎస్ఐ జి సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై మెయిన్ రోడ్డు గుండా ఎర్రవరం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ఏలేశ్వరం పోలీసులతో పాటు స్థానిక యువకులు పాల్గొన్నారు.



కాకినాడలో హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, వాహనదారులు

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - కాకినాడ

రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చునని రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి. రామారావు, కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాస రావు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా కాకినాడ ఆర్‌టిసి డిపోలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదానం శిబిరాన్ని వారు ప్రారంభించారు. డ్రైవర్లు రహదారి నియమ నిబంధనలను తప్పని సరిగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించ వచ్చునని వారు సూచించారు. రెడ్ క్రాస్, రోటరీ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 120మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కామరాజు, ఆర్టీసీ వైద్యశాల డాక్టర్ వీరలక్ష్మి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పి.బాలకృష్ణ, ఇంచార్జి డిపో మేనేజర్ కిరణ్ కుమార్, కాకినాడ ఆర్‌టిసి డిపో స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా ఏఆర్ బలగాల వార్షిక మొబలైజేషన్ ముగింపు పరేడ్ కాకినాడ జిల్లా పోలీస్ మైదానంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ హరిరావు పెరేడ్ కమాండర్‌గా సాగిన సాయుధ బలగాల పరేడ్‌లో ముఖ్య అతిథిగా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు గౌరవ వందనం స్వీకరిం చారు. అనంతరం ఆయన మాట్లాడాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఏఆర్ సిబ్బంది అందరూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వత్తి నైపుణ్యా లను పెంచుకోవాలని, ఇదే సమయంలో శారీరక దృఢత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనారు. శాంతి భద్రతల పరిరక్షణ సందర్భంలో క్రమశిక్షణ, నైపుణ్యంతో విధులు నిర్వర్తించా లన్నారు. కార్యక్ర మంలో ఎఎస్‌పిలు పి. శ్రీనివాస్, పి సత్యనారా యణ, డిఎస్‌పిలు ఆర్ వెంకటఅప్పారావు, అంబికా ప్రసాద్, ఏఆర్ఆర్ఐలు, పెద్దాపురం కాకినాడ ఎస్‌డిపిఒలు వెంకటేశ్వరరావు, పి.మురళి కృష్ణారెడ్డి, స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సినీనటి జమునకు నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజానాట్య మండలి నుంచి సినీ రంగ ప్రవేశం చేసిన ప్రముఖ సినీనటి జమున సంస్మరణ సభ ప్రజా సంఘాల భవనంలో ఉంగరాల వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పుల్లేపు తాతయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు పుల్లేపు వెంకటేశ్వరరావు హాజరైమాట్లాడారు. ముందుగా జమున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, వడ్డిఏడుకొండలు, సలాది సత్తిబాబు, తణుకురాజు,గోడి భాస్కరరావు, వళ్ళు రాజబాబు, పలివెల సింహాచలం, చల్లా సంతోష్ కుమార్, మురాల రాజేష్, సత్యనారాయణ, నల్లి ఈశ్వరరావు, దీపకుడు పాల్గొన్నారు.

విక్టోరియా క్లబ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తూర్పుగోదావరి జిల్లా విక్టోరియా క్లబ్ ఎనిమిదవ క్రికెట్ టోర్నమెంట్‌ను కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 3 నుండి 12వ తేదీ వరకు పది రోజులపాటు జరుగనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విక్టోరియా క్రికెట్ క్లబ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు నగేష్ కుమార్, రంగరాయ ప్రిన్సిపల్ నరసింహం ప్రారంభించారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి 40- 65 సంవత్సరాలు వరకు ఉన్నవారు ఈ టోర్నమెంట్లో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చే నగదు మొత్తాన్ని క్రికెట్ ఆడాలనుకునే మధ్యతరగతి యువతకు అందజేస్తామన్నారు. ఉదయం రాజమహేంద్రవరం జట్టుకు విక్టోరియా బి-జట్టుకు మధ్య మ్యాచ్ జరిగింది. విక్టోరియా బీ జట్టుపై రాజమహేంద్ర వరం జట్టు 71 రన్‌ల తేడాతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా షబ్బీర్ 85 పరుగులు ఎంపికయ్యారు. మధ్యాహ్నం కోనసీమ, మెట్రో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కోనసీమ జట్టు 97 రన్‌ల తేడాతో విజయం సాధించింది. కోనసీమ జట్టుకు చెందిన వాసు 47 పరుగులతో, మూడు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

కార్టూ'నిజం'




సమీక్షలో మాట్లాడిన విషయాలు కూడా టాపింగ్ అయ్యాయి సార్..!!

విద్యాదాత ఎంఎస్ఎన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ వ్యవస్థాపకులు మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 108వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎం.ఎస్.ఎన్ చారిటీస్ విద్యా సంస్థలో నిర్వహించిన సంస్మరణ సభకు 2500 మంది విద్యార్థులకు పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఛైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంస్థ అభివద్ధికి కషి చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటి కమిషనర్ ఎం.విజయరాజు మాట్లాడుతూ అందరికి ఆదర్శం విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ అన్నారు. కుడా ఛైర్మన్ రాగిరెడ్డి మాట్లాడుతూ 107 సంవత్సరాలుగా విద్యనందిస్తున్న గొప్ప సంస్థ అని కొనియాడారు. మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న సాగర్ మాట్లాడుతూ విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ అని కొనియాడారు.

మాజీ కార్పొరేటర్‌లు మీసాల శ్రీదేవి దుర్గాప్రసాద్, ఎం.జి.కె కిశోర్ కుమార్‌లు మాట్లాడుతూ సంస్థ అభివద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి పి.బాబూరావు సంస్థ పరిపాలన నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి పి.నారాయణమూర్తి, కర్రి నారాయణరావు, పద్మశ్రీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అమరేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. విజయ కుమారి, ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ సుబ్రహ్మణ్యం, బి.గంగాధరరావు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **తాళ్ళరేవు** మండలం పెదబొడ్డు వెంకటాయపాలెంలో విద్యాదాత మల్లాడి సత్యలింగనాయకర్ విగ్రహానికి పూలమాలలు వేసి అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, స్థానిక నాయకులు బర్రేబుజ్జి బాబు, కొపనాతి నాగరాజు, మల్లాడి శ్రీనివాస్, ఉపసర్పంచ్ భైరవమూర్తి,వార్డు సభ్యులు వర్మ,సంగాడి శ్రీనివాస్, రేకాడి వెంకటేశ్వర్లు. దండుప్రోలు ఆదినారాయణ స్థానిక యువకులు, నివాళులర్పించారు.



ఎంఎస్ఎన్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న ఛైర్మన్ కార్తీక్ నాయకర్

స్ట్రాంగ్ రూమ్‌కు ఎన్నికల సామగ్రి తరలింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కలెక్టర్ కృతిక శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్ ఆదేశాల మేరకు కాకినాడ బాల భవన్‌లో ఉన్న నాలుగు డివిజన్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని శుక్రవారం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పర్యవేక్షణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో పోలీస్ బందోబస్తుతో నగరపాలక సంస్థ పాత భవనానికి వీటిని తరలించారు. ఈ సందర్భంగా ఏడీసీ నాగ నరసింహారావు మాట్లాడుతూ 2021 నవంబర్ నెలలో కాకినాడ నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న 3, 9, 16, 30 డివిజన్లకు ఎన్నికలు నిర్వహించారన్నారు. అనంతరం ఎన్నికల సామగ్రిని బాల భవన్‌లో భద్రపరి చామన్నారు. ప్రస్తుతం వీటిని పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య నగరపాలక సంస్థ పాత కార్యాలయ ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, వైసిపి ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ప్రతినిధి బాజీబోయిన వెంకటేష్ నాయుడు, టిడిపి ప్రతినిధి గదుల సాయిబాబా పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో యువకునికి జైలు

ప్రజాశక్తి - అల్లవరం

బైకు చోరీ కేసులో యువకునికి రెండేళ్ల జైలు, రూ.వెయి జరిమానా విధిస్తూ జడ్జి కె.దీపాదైవకృప శుక్రవారం తీర్పునిచ్చారని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. అల్లవరంకు చెందిన గండేటి నరసింహ (20) మూడు ప్రాంతాల్లో మూడు బైకులు దొంగిలించారన్నారు. ఈ కేసుల్లో నరసింహను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. నేరం రుజువు కావడంతో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, 1,000 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారన్నారు. పిపి వి.శ్రీరాములు వాదనలు వినిపించారన్నారు. హెడ్ కానిస్టేబుల్ జి.ప్రభాకర్ కేసులో సహకరించారన్నారు.

రైలు కిందపడి హెచ్ఎం ఆత్మహత్య

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు నవాబుపేట రైల్వే స్టేషన్ మధ్యలో శుక్రవారం నిడదవోలు రాయిపేటకు చెందిన హెచ్ఎం వి.శ్రీనివాసరావు (56) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని జిఆర్పి ఎస్ఐ డి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు చెన్నాయిగూడెం స్కూల్లో హెడ్మాస్టర్గా పని చేస్తున్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. ఆ బాధను తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు.

పాస్టర్పై గుర్తు తెలియని వ్యక్తి దాడి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద బ్రహ్మదేవంలోని పాస్టర్ ఓగు విలియమ్స్పై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి కొడవలితో దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయాల పాలయ్యారు. సామర్లకోట పోలీసుల కథనం ప్రకారం పెదబ్రహ్మదేవంలోని మంచినీటి చెరువు వద్ద గల చర్చిలో పాస్టర్గా పనిచేస్తున్న విలియమ్స్ గురువారం రాత్రి ఇంట్లో నిద్రపోతుండగా రాత్రి ఒంటిగంట సమ యంలో గుర్తు తెలియని వ్యక్తి మంకీ క్యాప్ ముసుగు ధరించుకుని గేటు దూకి వచ్చి కొడవలితో దాడికి పాల్పడ్డాడు. విలియమ్స్ పెద్దగా కేకలు పెట్టడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. ఈ దాడిలో విలియమ్స్ కాళ్లకు, చేతులకు, ముఖానికి రక్తపు గాయాలు కాగా అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సామర్లకోట పోలీసులు పాస్టర్ నివాసం ఉంటున్న చర్చి, ఇంటి పరిసర ప్రాంతాలను, సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. పాస్టర్ విలియమ్స్ భార్య, కుమార్తె ఒరిస్సాలో ఉంటుండగా కుమారుడు ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. విలియమ్స్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని తిరుపతి ధన్వంతరి సూరి సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చినకొండేపూడిలో వర్మగారి వీధిలో ఉన్న ఇంటివద్ద పార్కు చేసిన హీరో ప్లెజర్ బైకును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు ఫిర్యాదు చేశారు. సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమర్థవంతంగా సేవలందించాలి

- సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం పరిశీలనలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమాచార వారధిగా సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా విభాగం సమర్ధవంతమైన సేవలు అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక రామారావు పేట కేపీఆర్ రోడ్ వీధిలోని కాకినాడ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని డిపిఆర్ఓ, కాకినాడ కార్యాలయం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్న విధానం, ఇందుకు వివిధ సమాచార మాధ్యమాలతో ఏర్పరచుకున్న సమన్వయం గురించి ఆయన ఆ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మీడియా సంస్థల ప్రోత్సాహం, జర్నలిస్టుల సంక్షేమం కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటిని జిల్లాలో అమలు చేస్తున్న తీరును, మీడియా రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులు, తదనుగుణంగా ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందించే దుకు చేపడుతున్న విధానాలు, అవాంఛిత పోకడలను నిరోధించేందుకు అనుసరిస్తున్న వైఖరుల గురించి డివిజనల్ పిఆర్ఓ పి.రవి ఆయనకు వివరించారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్ధవంతంగా చేరవేసి, వాటిని లక్షిత వర్గాల ప్రజలు సమగ్రంగా సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన వారిని కోరారు.కార్యక్రమంలో పిఆర్ఓలు కె.రవి, అజయ్, ఏవి సూపర్వైజర్ ధర్మరాజు, ఎఐఈ సిద్ధాంతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా సమాచార కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎసి ప్రఖర్ జైన్

ఆదిత్యలో అదిత్ -2కె 23 ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో అజిత్కుమార్, నీరజ్కుమార్, సుగుణారెడ్డి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ మేనేజ్మెంట్ స్కూల్ ఆధ్వర్యంలో అదిత్-2కె23 కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వి.డి.ఎం వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య అజిత్కుమార్, రాక్ సెరా మిక్స్ హెచ్ఆర్హెడ్ టి.నీరజ్కుమార్లు జ్యోతి ప్రజ్వలనంతో కార్యమ్రాన్ని ప్రారంభించారు. సుగుణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సజనాత్మక ఆలోచనలకు అద్దం పట్టే విధంగా ఈ అదిత్ 2కె23 లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెటింగ్, ఫైనాన్స్, మానవ వనరులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో క్విజ్, సాంస్కతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతు లతో పాటు ప్రశంసా పాత్రలను అందజేయనున్నట్లు ఆమె తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గల 25 బిజినెస్ కళాశాలల కు చెందిన 450 విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల సాంస్కతిక నత్యాలతో స్వాగత కార్యక్రమం, ఏర్పాటుచేసిన స్టాల్స్ ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్ రెడ్డి, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య టెక్నికల్ హబ్ 7వ వార్షికోత్సవం

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలోటెక్నికల్ హబ్ ప్రారంభించి నేటికి 7 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా టెక్నికల్ హబ్ టీమ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టెక్నికల్ హబ్ సిఇఒ బాబ్జి నీలం టెక్నికల్ హబ్ ప్రస్థానం గురించి వివరించారు. ముఖ్య అతిథిగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ 2016లో ప్రారంభించిన ఈ టెక్నికల్ హబ్ నేడు 40 శాతంపైగా విద్యార్థులకు ఎంతో ఉత్సాహంతో నమ్మకంతో శిక్షణ అందించి, 31.31 లక్షల అత్యుత్తమ వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించే విధంగా తర్ఫీదు ఇచ్చామన్నారు. శిక్షణ అందిస్తున్న టెక్నికల్ హబ్ సిబ్బందికి, విద్యార్థులకు, తల్లితండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదిత్య చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ నేటి తరాలకు



టెక్నికల్ హబ్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి

బంగారు భవిష్యత్తును అందిస్తున్న టెక్నికల్ క్లబ్ సీఈవో నీలం బాబ్జికి ప్రత్యేక అభినందనలు తెలిపారు అనంతరం టెక్నికల్ హబ్ లో వివిధ రంగాలలో విశేష కషి చేసిన సిబ్బందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్లు డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్ సుబ్రహ్మణ్యం, ఫార్మసి కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె. రవిశంకర్, డి. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధనబాబు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి ఏలేశ్వరం

దళిత నాయకుడు, లిబరేషన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మసకపల్లి ధనబాబు (41) ఆకస్మిక మతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ధనబాబు పేదల ఇళ్ల స్థలాల సాధన, దళిత, గిరిజన సమస్యల పరిష్కారానికి నిర్వహించిన అనేక పోరాటాల్లో స్వర్గ పాల్గొనే వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సిఐటియు నాయకులు పిల్ల రాంబాబు, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, కేంద్ర కమిటీ సభ్యులు బుగతా బంగార్రావు, జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, ఐప్వా నాయకులు కాకర కుమారి మతుని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.


వినియోగదారుల చట్టాలపై అవగాహన

పెద్దాపురం : పెద్దాపురం మండలం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దాపురం మండలం ఆర్ బి కొత్తూరు సచివాలయంలో వినియోగ దారులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రభుత్వం సరఫరా చేసిన వినియోగదారుల అవగాహన మ్యాగజైన్స్ను పంపిణీ చేశారు. అనంతరం సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే వినియోగదారులు పూర్తిస్థాయిలో న్యాయం పొందగలుగుతార న్నారు. ఈ సందర్భంగా ఆయన చట్టాల గురించి వివరించారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి జె పద్మరాజు, సచివాలయ కె.సురేఖ, సంఘ కార్యదర్శి ఎం భాస్కరరావు, కెవివి లక్ష్మి,వాలంటీర్లు పాల్గొన్నారు.

సామర్లకోట వైస్ ఎంపిపి-1గా పేర్నీడి ఏకగ్రీవం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మొదటి వైస్ ఎంపిపిగా గొంచాల వైసిపి ఎంపిటిసి పేర్నీడి వెంకటరాయుడు ఏకగ్రీవంగా ఎనిక య్యారు. మండల మొదటి వైస్ ఎంపిపి వికెరాయ పురం-2 ఎంపిటిసి మలిరెడ్డి సూర్యావతి ఆకస్మిక మరణంతో ఈ ఎన్నికను నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మంది రంలో పెద్దాపురం ఆర్డిఒ కెన్వి ప్రసారావు ఎన్నికల రిటర్నింగ్ అధికా రిగా ఎన్నికను నిర్వహించారు. వైస్ ఎంపిపి-1 పదవికి వైసిపి తరపున ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో రిటర్నింగ్ అధికారి ప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. మండల మొదటి ఉపాధ్యక్షులుగా గొంచాల గ్రామ ఎంపిటిసి పేర్నీడి వెంకట రాయుడు అభ్యర్థిత్వాన్ని మాధవ పట్నం-2 ఎంపిటిసి మేడిశెట్టి దుర్గాదేవి ప్రతిపాదించగా, పెద బ్రహ్మదేవం-1 ఎంపిటిసి మలకల సూర్యారావు బలపరిచడంతో ఎన్నికను ఖరారు చేశారు. నూతనంగా ఎన్నికైన మండల ప్రజా పరిషత్ మొదటి ఉపా ధ్యక్షులు వెంకట రాయుడును సామర్లకోట జడ్పిటిసి ఎలిశెట్టి అమృత నరేష్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విప్పర్తి వీర సాయిబాబు, పలువురు ఎంపిటిసిలు, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా వైఎస్ ఎంపిపిగా ధ్రువీకరణ



వైస్ ఎంపిపి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పేర్నీడి వెంకటరాయుడు

పత్రాన్ని పొందిన అనం తరం పేర్నీడి వెంకట రాయుడు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దా పురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి దవులూరి దొరబాబును మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలుగా దొరబాబు ఆయనను అభినందించారు.

కళాతపస్వి మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెద్దాపురం

కళా తపస్వి కె.విశ్వనాథ్ మతికి పెద్దాపురం మండల ప్రజానాట్య మండలి కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సంగీతం, ఉత్తమ సాహిత్యం, ఉత్తమ విలువలతో కూడిన ఆణి ముత్యాలు లాంటి సినిమాలను తీసిన ఆయన సినీ పరిశ్రమలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కేదారి నాగు, మండల అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్తిబాబు, రొంగల వీర్రాజు, సీనియర్ కళాకారులు దారపు రెడ్డి కష్ణ,దారపు రెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, కూనిరెడ్డి అప్పన్న తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో 14 మందికి గాయాలు

ప్రజాశక్తి - కోటనందూరు, గోపాలపురం

కోటనందూరు బిహెచ్, కోట,గోపాలపురం కరిచర్లగూడెంలో పిచ్చికుక్కలు దాడి చేసి 14 మందిని గాయపర్చాయి. జోగా జోగేయ్యమ్మ, జోగా ముసలయ్య, మువ్వల వేణమ్మ, అచ్యుత స్వామి, గొప్ప శ్రావణిలతో పాటు మరి కొందరిని కోటనందూరు పిహెచ్సిలో ప్రథమ చికిత్స అనంతరం తుని ఏరియా ఆసుపత్రిలో వెళ్లారు. బాధితులను సర్పంచ్ జిగటల వీరబాబు ఎంపిటిసి మాణిక్యాల రావు పరామర్శించారు. బోగిశెట్టి ఏసురత్నం, కోలా సత్యవతి, పఠాన్ సత్తార్, మీసాల సత్యనారాయణ గోపాలపురం సిహెచ్సిలో వైద్యం చేయించుకున్నారు.

నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు

ప్రజాశక్తి - అమలాపురం

నవరత్నాలతో పేదల ఇంట్లో వెలుగులు ప్రసరిస్తున్నాయని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం అయన గోడి, గోడిలంక గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడేళ్లలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించామన్నారు. పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఇళ్లరుణాలు, తాగునీటి సమస్యలను పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. అర్హత ఉండి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ఇంటి స్థలం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పినిపే శ్రీకాంత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తలకు గాయమైతే ...చెయ్యి తీసే వరకు తెచ్చారు..

-జిజిహెచ్ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం అంటూ తల్లి తండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తలకు గాయమై ఆసుపత్రిలో చేరితే... ఇప్పుడు చెయ్యి తీసేయకపోతే ప్రాణానికే ప్రమాదంఅని జిజిహెచ్ వైద్యులు అంటున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పెళ్లి అయి రెండు నెలలు కూడా కాలేదు.. నాకు ఈ అమ్మాయి వద్దు అని అత్తింటి నుంచి వార్త... వైద్యుల నిర్లక్షానికి గారాబంగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు జీవితం ఇలా అయింది ఏంటి అంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ ఒక కుటుంబం ఇప్పుడు న్యాయం కోసం పోరాడుతోంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామారాజు జిల్లా బురద కోట, కొండపల్లి ఏజెన్సీ గ్రామానికి చెందిన బిత్తిరి రాజు, లక్ష్మి కుమార్తె దివ్య సంక్రాంతి సెలవులకు హాస్టల్ నుంచి తమ వారిని తీసుకురావడానికి శంఖవరం మండలం వేళంగి వెప్పుండగా ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం మీద నుంచి పడిపోగా తలకు గాయమై కాకినాడ జీజీహెచ్లో గత నెల 14న చేరింది. తలకు గాయం కావ డంతో ప్రమాదం ఏమీ లేదని చెప్పి మందులు వాడితే తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. అయితే చేతికి సెలైన్ పెడితే ఎక్కడం లేదని సిబ్బందికి చెప్పినప్పటికీ వినిపించుకోకుండా అలాగే వదిలేయడంతో చేతి వరకు ఉబ్బి పోయిందని తల్లిదండ్రులకు అంటున్నారు. అయితే ఆ రోజే అదే చేతికి ఇంజక్షన్ చేయడంతో నొప్పి తట్టుకోలేక విలవిల్లాడిన దివ్య చేయి మరుసటి రోజు పూర్తిగా నల్లగా మారిందని తల్లిదండ్రులు చెబుతు న్నారు. డాక్టర్కు చూపించాలని అక్కడ నర్సులకు చెప్పినా, సెలవులు కావడంతో వైద్యులు లేరని సిబ్బంది నుంచి సమాధానం. తరువాత డాక్టర్ వచ్చి చూసి నీరు పట్టిందని ఏం పరవాలేదని, ఆపరేషన్ చేసి నీరు తీసేస్తామని చెప్పి, చేతిని కోసి అలానే వదిలేశారన్నారు. తీరా చూస్తే ఇప్పుడు చేయి తీసేయాలని, లేకపోతే ప్రాణానికి ప్రమాదం అని వైద్యులు అంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యం చేస్తున్నారు.



చికిత్స పొందుతున్నబిత్తిరి దివ్య

డాల్ఫిన్కు పోస్టుమార్టం

ప్రజాశక్తి - పెదపూడి

ఏపీ త్రయం శివారు బిక్కవోలు డ్రెయిన్లో గురువారం మధ్యాహ్నం చిక్కిన డాల్ఫిన్ చేపకు శుక్రవారం ఉదయం పోస్టుమార్టం చేసి, కాలువగట్టు పక్కన గొయ్యి తవ్వి పూడ్చివేశారు. తహశీల్దార్ టి. సుబాష్, జిల్లా ఫారెస్ట్ అధికారి ఐ.వి.కె.రాజు తెలిపిన వివరాల ప్రకారం పశుసంవర్ధశాఖ, మత్స్య శాఖ, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో డాల్ఫిన్ చేపకు పోస్టుమార్టం నిబంధనలు ప్రకారం చేశారన్నారు. డాల్ఫిన్కు పశువైద్యులు ఫణీంద్ర, కిరణ్మయి, భరత్ పోస్టు మార్టం చేశారన్నారు. అయితే డాల్ఫిన్ ఉప్పు నీటిలో జీవిస్తుందని, బిక్కవోలు డ్రెయిన్లో కొద్దిపాటి తియ్యటి నీరు, బురద తగల డంతో జీవించలేక పోయిందని వైద్యులు తెలిపారన్నారు. అనంతరం దానిని గొయ్యి తవ్వి దానిలో వెట్టి పూడ్చి వేశారన్నారు. విఆర్ఒ జి. అంబిబాబు, ఫారెస్ట్ అధికా రులు సిద్ధార్థ, ఉపేంద్రరెడ్డి, వసంతకుమారి, మత్సశాఖ ఎల్డిఒ నూకరాజు పాల్గొన్నారు.



డాల్ఫిన్కు పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యులు

'సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం'

కపిలేశ్వరపురం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఎం జగన్మోహన్రెడ్డి కషి చేస్తున్నారని ఎంఎల్ సి తోట త్రిమూర్తులు అన్నారు. మండలములోని కాలేరులో శుక్రవారం నిర్వహించిన 2వ రోజు 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎంఎల్సి తోట పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు పి.వీరవెంకట సూర్యనారాయణ, ఎంపిపి ఎం.సత్యవేణి, ఎంపిటిసి సభ్యులు టేకి శ్రీసత్యమంజు, వై.గంగరాజు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో సమన్వయం అవసరం

పెరవలి : అభివృద్ధి పనుల్లో సమన్వయం అవసరమని ఎంపిపి కార్చెర్ల సీతారాం ప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు గ్రామాలకు వెళ్లేటప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకుని ముందుకు వెళ్లాలని ఎంపిపి సూచించారు. ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడుతూ అధికారులు సాధారణ సమావేశాలకు హాజరుకాకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కొమ్మిశెట్టి రామాంజిని, పంచాయతీ విస్తరణాధికారి పివిఎన్.నరసింహమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

ఉప్పలగుప్తం : బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని భీమేశ్వర లైటింగ్, టెంట్, సౌండ్, జనరేటర్స్ అసోసియేషన్ మండల సమావేశం విజ్ఞప్తి చేసింది. ఉప్పలగుప్తంలో శుక్రవారం అసోసియేషన్ మండల అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తమ భద్రత కోసం ఆరోగ్య, జీవిత బీమా సదుపాయాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వత్తి, వ్యాపారం నిమిత్తం కార్యక్రమాలు జరుపుకునేందుకు పోలీసుల నుంచి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కె.నరేష్, సంయుక్త కార్యదర్శి శీలం ఈశ్వరరావు, నెల్లి సత్యనారాయణ, శీలం నాగబాబు, ఎలిపే శ్రీనివాసరావు, ఆదినారాయణమూర్తి, పలివెల రాంప్రసాద్ పాల్గొన్నారు.

'రాహుల్ నాయకత్వాన్ని బలపరుద్దాం..'

ఉప్పలగుప్తం : హాత్ సే హాత్ జోడో అభియాన్ చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గొల్లవిల్లి సెంటర్లో గోడ పత్రికను విడుదల చేశారు. ఎపికి ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, విభజన హామీలు రాహుల్గాంధీ వల్లే సాధ్యమని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి అయితాబత్తుల సుభాషిణి అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యురాలు దోనిపాటి విజయలక్ష్మి, పార్టీ నాయకులు జోగి అర్జునరావు, గెడ్డం సురేష్ బాబు, నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, దామిశెట్టి జయ పాల్గొన్నారు.

దర్శకుడు విశ్వనాథ్ మృతికి మల్లిబాబు సంతాపం

ప్రజాశక్తి - మండపేట

కళాతపస్వి, సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ మతి పట్ల తాపేశ్వరం సురుచి అధినేత పోలిశెట్టి మల్లిబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాశ్చాత్య ఒరవడిలో కొట్టుకొ పోతున్న తెలుగు వారిని భాషా, సంస్కతుల పట్ల గౌరవం కలిగించే చిత్రాలతో మేల్కొలిపిన దార్శనికుడని కొనియాడారు. తాను విశ్వనాథ్ను తరుచూ కలిసేవాడినని పేర్కొన్నారు. ఎంతో ప్రేమ ఆప్యాయంగా పలకరించే వారని గుర్తు చేసుకున్నారు. ఆయన మతి పట్ల సురుచి సిబ్బంది సంతాపం ప్రకటించారు.

పుంగనూరు ఆవుకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులో రైతు రెడ్డి సత్యనారాయణమూర్తి చెందిన పుంగనూరు ఆవుకు శుక్రవారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆవు ఆకస్మికంగా శుక్రవారం మృత్యువాత పడింది. దీంతో స్థానిక సర్పంచ్ గుణ్ణం రాంబాబు సమక్షంలో ఆవుకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆవు 14 ఈతలతో రికార్డు స్థాయిలో పలు గిత్తలకు, పెయ్యి దూడలకు జన్మనిచ్చింది, ప్రస్తుతం ఈ ఆవు గర్భం దాల్చి ఉందని రైతు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పుంగనూరు ఆవుల అందాల పోటీలు, పాల దిగుబడి పోటీల్లో విజేతగా నిలిచిందని సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపిటిసి సభ్యులు యార్లగడ్డ రమేష్చౌదరి తెలిపారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేటలోని శ్రీనివాసపేటకు చెందిన సాకా ఆనంద్ ఇటీవల మృతి చెందారు. ఆయన తల్లి సత్యవతిని ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట జడ్పిటిసి సభ్యులు గూడపాటి రమాదేవి, నాయకులు ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఆర్.సూరిబాబు, ప్రెసిడెంట్గా మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శిగా రాయుడు వీరాస్వామినాథన్, వైస్ ప్రెసిడెంట్గా ఎం.ప్రసాద్, గైక్వాడ్, దుర్గా ప్రసాద్, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, నంబూరి సత్యనారాయణ, ట్రెజరర్ సిహెచ్.కృష్ణ, సబ్ ట్రెజరర్ కె.శ్రీను, జాయింట్ సెక్రటరీగా వి.బ్రహ్మాజీ, సంఘ ముఖ్య సలహాదారునిగా బి.సత్తిబాబు ఎన్నికయ్యారు.

సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ షెడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దరి, పాలంగి గ్రామాల్లో సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ షెడ్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని ఇఒపిఆర్డి ముత్యం వీరాస్వామి నాయుడు తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యంగా ఉంచేందుకు ఈ షెడ్ల నిర్మాణం ప్రారంభించారన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణకు యూజర్ ఛార్జీలు చెల్లించి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యవంతంగా మార్చాలని ఆయన కోరారు.

వైద్య శిబిరంలో కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవత శాఖ సహకారంతో, పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో వేలివెన్ను అయ్యప్ప స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నేత్రపరీక్షా శిబిరంలో 200 మందికి నేత్రపరీక్ష చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిలో 22 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు తెలిపారు. 80 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు తెలిపారు.